ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



వికారాబాద్ - మేడ్చల్

జిల్లాల వార్తలు

5

శుక్రవారం 1 మార్చి 2024

ఆర్టీసీ కార్మికులకు 'ప్రగతి చక్రం' పురస్కారాలు

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 29:సమర్థవంతగా విధులు నిర్వహించిన మేడ్చల్ ఆర్టీసీడిపో కార్మికులకు గురువారం ప్రగతి చక్రం పురస్కారాలను ప్రదానం చేశారు. డిపోలో మేనేజర్ సుధాకర్ కార్మికులను పురస్కారాలతో సన్మానించారు. జనవరిలో అత్యధిక ఇన్సెంటివ్ సాధించిన కండక్టర్, ఇంధనం పొదుపు చేసిన డ్రైవర్లను ఆయన సత్కరించారు. కార్యక్రమంలో డిపో ఏఎం రామారావు, ఉద్యోగులు పాల్గొన్నారు.



చేవెళ్లలో కాంగ్రెస్ సభకు హాజరైన జనం(ఫైల్)



- లోక్‌సభ ఎన్నికలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం
- చేరికలపైనే ప్రధాన దృష్టి
- కార్యకర్తలకు సీఎం రేవంత్ భరోసా
- ఉమ్మడి జిల్లాలో మారుతున్న రాజకీయ సమీకరణాలు
- రోజురోజుకూ బలహీనపడుతున్న బీఆర్ఎస్

కాంగ్రెస్‌కు జవసత్వాలు

చేవెళ్ల సభతో కేడర్‌లో నూతనోత్తేజం

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తరువాత రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వ ఏర్పాటుతో కాంగ్రెస్ పార్టీలో జోష్ నెలకొంది. రానున్న లోక్‌సభ ఎన్నికలను పార్టీ నాయకత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. ఉమ్మడి జిల్లా పరిధిలోని చేవెళ్ల, మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా నాయకులు పనిచేస్తున్నారు. మొదటగా పార్టీని మరింత బలోపేతం చేసే చర్యలను రాష్ట్ర నాయకత్వం చేపట్టింది. ఇందులో భాగంగా బీఆర్ఎస్, ఇతర పార్టీల నుంచి నేతలను కాంగ్రెస్‌లో చేర్చుకుంటూ ప్రతిపక్షాలకు గట్టి సవాల్ విసురుతున్నారు. ఇటీవల చేవెళ్ల సభ సక్సెస్‌తో రెట్టించిన ఉత్సాహంతో క్యాడర్ పని చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ పదవులు కాంగ్రెస్సే కైవసం చేసుకుంటుందని, పార్టీ కోసం శ్రమించిన వారికి తగిన ఫలితం దక్కేలా నాయకత్వం పనిచేస్తుందని పీసీసీ చీఫ్ కేడర్‌కు భరోసా ఇచ్చారు.

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

లోక్‌సభ ఎన్నికలకు సమాయాత్తమవుతున్న అధికార కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లాలో పూర్తిస్థాయిలో పుంజుకునే యత్నం చేస్తోంది. తాజాగా మంగళవారం చేవెళ్లలో జరిగిన జనజాతర బహిరంగ సభకు భారీగా జనం తరలి రావడంతో హస్తం పార్టీ కేడర్‌లో జోష్ పెరిగింది. ఈ సభ ద్వారా ప్రతిపక్షాలకు అధికార కాంగ్రెస్ పార్టీ గట్టి సంకేతాలే పంపింది. అలాగే కేడర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి భవిష్యత్తుపై భరోసా ఇచ్చారు. పార్టీ కోసం పనిచేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయబోమని ఈ సభలో స్పష్టం చేశారు. పార్టీ కోసం కష్టపడిన వారందరికీ స్థానిక ఎన్నికల్లో అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. దీంతో పాటు నామినేటెడ్ పోస్టుల భర్తీ ద్వారా కూడా కొందరికి న్యాయం చేస్తామని చెప్పారు. ఒక విధంగా కాంగ్రెస్ ఈ సభ ద్వారా పార్లమెంట్ ఎన్నికలకు శంఖారావాన్ని పూరించిందనే చెప్పాలి. లోక్‌సభ ఎన్నికలకు ముందు పార్టీలో జవసత్వాలు నింపేందుకు కాంగ్రెస్ క్షేత్రస్థాయిలో బలాన్ని పెంచుకుంటోంది. తాజాగా జరిగిన చేవెళ్ల సభలో బీఆర్ఎస్ నుంచి అనేక మంది నేతలు కాంగ్రెస్‌లో చేరారు. దీనికి కొద్ది రోజుల ముందే రంగారెడ్డి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్లు అనితారెడ్డి, సునీతారెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అలాగే ఎమ్మెల్సీ, మాజీ మంత్రి మహేందర్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి సైతం గులాబీ పార్టీని వీడి కాంగ్రెస్ గూటికి చేరారు. త్వరలో కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం సాగుతోంది. ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డి టచ్‌లోకి వెళ్లారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సీఎం రేవంత్‌ను కలిసి గంటసేపు మంతనాలు జరిపారు. అప్పటి నుంచి ఆయన బీఆర్ఎస్ చేపడుతున్న కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం లేదు.

ఇక క్షేత్రస్థాయిలో కూడా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, ఎంపీపీ, జడ్పీటీసీలను సైతం పెద్ద సంఖ్యలో తమ పార్టీలో చేర్చుకునేందుకు కాంగ్రెస్ వ్యూహరచన చేస్తోంది. లోక్‌సభ ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండడంతో చేరికలను వేగవంతం చేయాలని పార్టీ ముఖ్య నేతలకు అధిష్ఠానం ఆదేశాలు జారీ చేసింది. మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి ఇప్పటికే కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే ఉమ్మడి జిల్లాలోని చేవెళ్ల, మల్కాజిగిరి రెండు లోక్‌సభ స్థానాలనూ దక్కించుకోవడం సీఎం రేవంత్‌రెడ్డికి ప్రతిష్ఠాత్మకమే. ఇందులో మల్కాజిగిరి నుంచి సీఎం రేవంత్‌రెడ్డే ప్రాతినిథ్యం వహించిన సంగతి తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల తరువాత ఆయన ఈ స్థానానికి రాజీనామా చేశారు. అలాగే ఇప్పుడు ఆయన చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జిగా కూడా ఉన్నారు. దీంతో ఈ రెండు లోక్‌సభ స్థానాల ఎన్నికలు ఆయనకు సవాల్ అని చెప్పక తప్పదు. త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల, మల్కాజిగిరి స్థానాల్లో త్రిముఖపోటీ నెలకొనే అవకాశం ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో దెబ్బతిన్నప్పటికీ ఈ రెండు లోక్‌సభ స్థానాల పరిధిలో మాత్రం మెజార్టీ ఓట్లే సాధించింది. అయితే కాంగ్రెస్ అధికార పగ్గాలు చేపట్టినప్పటి నుంచి బీఆర్ఎస్ పరిస్థితి క్షేత్రస్థాయిలో గడ్డు పరిస్థితినే ఎదుర్కొంటోంది.

రెండు లోక్‌సభ స్థానాల్లో గెలుపే లక్ష్యం

కాంగ్రెస్‌కు రోజు రోజుకూ వలసలు పెరుగుతున్నాయి. కీలక నేతలంతా అధికార కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. ఈ పరిణామాలను కాంగ్రెస్ పూర్తిగా అనుకూలంగా మార్చుకునే యత్నం చేస్తోంది. రాబోయే కాలంలో చేరికల పైనే ప్రధానంగా దృష్టిపెట్టాలని స్థానిక నాయకత్వానికి పార్టీ ఆదేశించింది. మరో వైపు బీఆర్ఎస్ బలహీనపడుతుండడంతో బీజేపీకి కొంత అనుకూల పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం బీఆర్ఎస్ కొంత బలంగానే కనిపిస్తున్నా లోక్‌సభ ఎన్నికల సమయానికి అధికార కాంగ్రెస్‌కు, బీజేపీల మధ్యే ప్రధాన పోటీ నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నుంచీ బీఆర్ఎస్‌ను వీడుతున్న వారిని పార్టీ నాయకత్వం నియంత్రించలేక పోవడంతో రోజురోజుకూ గులాబీ పార్టీ బలహీనపడుతోంది.



ఇన్‌చార్జి ఎంపీపీ సునీత



తీగల కృష్ణారెడ్డి



జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్‌తో మహేశ్వరంలో బీఆర్ఎస్‌కు భారీ గండి


- రోజురోజుకూ పెరుగుతున్న ముఖ్యనేతల రాజీనామాలు
- పార్టీలో చీలికలను నిలువరించలేక పోతున్న నేతలు

మహేశ్వరం, ఫిబ్రవరి 29 : మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్‌లో రోజురోజుకూ భారీ చీలికలతో పార్టీ కుదేలవుతుండగా కాంగ్రెస్‌లో మాత్రం జోష్ పెరుగుతోంది. మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ఆయన కోడలు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మండల ఇన్‌చార్జి ఎంపీపీ ఆర్.సునీత అంద్యానాయక్ దంపతులు, మహేశ్వరం మాజీ సర్పంచ్ కూనయాదయ్య, మన్‌సాన్‌పల్లి ఎల్లమ్మ ఆలయ కమిటీ చైర్మన్ మర్యాద మురళీధర్‌రెడ్డి, ఘట్టుపల్లి మాజీ సర్పంచ్ రాఖేష్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచులు దోమ శ్రీనివాస్ రెడ్డి, కె.రాములు, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మర్యాద రాఘవేందర్‌రెడ్డి, తుక్కుగూడ మున్సిపల్ బీఆర్ఎస్ మహిళావిభాగం అధ్యక్షురాలు పద్మ, తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీలు, మీర్‌పేట, బడంగ్‌పేట కార్పొరేషన్లలోని పలువురు ప్రజాప్రతినిధులు పదవులకు, బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామాలు చేసి కాంగ్రెస్‌లో చేరారు. అలాగే మహేశ్వరం, కందుకూరు మండలాల మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఉపసర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. భారీగా కొనసాగుతున్న చేరికలతో ఎన్నికల ముందున్న కాంగ్రెస్‌కు ప్రస్తుత కాంగ్రెస్‌కు పోలికే లేకుండా పోయింది. రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలోకి రావడంతో వలసల వెల్లువ కొనసాగుతోంది. లోక్‌సభ ఎన్నికల తర్వాత వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ తరుఫున పోటీ చేసేందుకు ఇప్పటి నుంచే నాయకులు, ప్రజాప్రతినిధులు హస్తం పార్టీలో చేరుతున్నారు. బీఆర్ఎస్ నాయకులతో పాటు వివిధ గ్రామాల్లోని పలువురు బీజేపీ కార్యకర్తలు కూడా కాంగ్రెస్‌లో చేరతారనే వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి కాంగ్రెస్‌ను బలోపేతం చేసే చర్యలను ముమ్మరం చేశారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను కనుమరుగు చేయాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ లీడర్లను, క్యాడర్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకుంటూ పావులు కదుపుతున్నారు. నాలుగు నెలల్లో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారు బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరుతున్నారు. గ్రామాల్లో అభివృద్ధి కావాలంటే పాలక పార్టీలోనే ఉండాలని చాలా మంది బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. మరింత మంది చేరికలకు సిద్ధం అవుతున్నారు. ఐదేళ్లుగా బీఆర్ఎస్‌కు అడ్డాగా ఉన్న మహేశ్వరం ఇక కాంగ్రెస్ గడ్డగా మారబోతోందనే వార్తలు జోరందుకున్నాయి. ఇంత జరుగుతున్నా 20 సంవత్సరాలుగా రాష్ట్ర రాజకీయాల్లో కీలక పదవులు నిర్వహించిన మహేశ్వరం బీఆర్ఎస్ ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి మౌనంగా ఉండడం బీఆర్ఎస్ వర్గాల్లో తీవ్ర దుమారాన్నే లేపుతోంది. లోక్‌సభ ఎన్నికల నాటికి మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను ఖాళీ చేయడమే లక్ష్యంగా రోజుకో గ్రామంలో బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటున్నా బీఆర్ఎస్ ఎమ్మెల్యే, పార్టీ ముఖ్య నేతలు నిలువరించడం లేదనే విమర్శలు తీవ్ర స్థాయిలో వ్యక్తం అవుతున్నాయి.

ఆశల కొలువులు

మెగా డీఎస్సీ .. 847 పోస్టులు!

- నోటిఫికేషన్ విడుదల చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు
- ఉమ్మడి జిల్లాలో భర్తీ కానున్న 847 టీచర్ పోస్టులు
- అత్యధికంగా రంగారెడ్డిలో 379, అత్యల్పంగా మేడ్చల్ జిల్లాలో 109 పోస్టులు, వికారాబాద్‌లో 359 పోస్టుల భర్తీ
- కేటగిరీల వారీగా ఖాళీలపై స్పష్టత కరువు
- తొలిసారి ఆన్‌లైన్ ఎగ్జామ్ నిర్వహణ
- రాత పరీక్ష తేదీలను త్వరలోనే ప్రకటించనున్న ప్రభుత్వం
- మార్చి 4 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- గతంలో దరఖాస్తు చేసుకుంటే మళ్లీ దరఖాస్తు అవసరం లేదు



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్/మేడ్చల్/వికారాబాద్ ప్రతినిధులు, ఫిబ్రవరి 29) : రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు తీపి కబురును అందించింది. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. టెట్ ఉత్తీర్ణులంతా డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేళ్లలో కేవలం ఒక్కసారి మాత్రమే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైంది. 2017 అక్టోబరులో రాష్ట్ర వ్యాప్తంగా 8,792 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసి నిర్వహణ బాధ్యతలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు అప్పగించింది. నియామక ప్రక్రియ ఆలస్యం తదితర కారణాలతో అభ్యర్థులు కోర్టును ఆశ్రయించగా 2021లో నియామకాలు పూర్తి చేసింది. డీఎడ్/బీఎడ్, బీపీఎడ్, లాంగ్వేజ్ పండిట్ శిక్షణ పూర్తి చేసుకొని టెట్ పాసైన లక్షలాది మంది నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఏర్పాటు కాగా గత సెప్టెంబరులో ప్రభుత్వం ఇచ్చిన డీఎస్సీ/టీఆర్‌టీ నోటిఫికేషన్‌ను రద్దు చేసి మరి కొన్ని పోస్టులను కలిపి 11,062 ఉపాధ్యాయ నియామకాలకు డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది.

భర్తీ కానున్న 847 పోస్టులు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 847 పోస్టులు భర్తీ కానున్నాయి. వాటిలో అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 379 రంగారెడ్డి, అత్యల్పంగా 109 మేడ్చల్ జిల్లాలో టీచర్ పోస్టులు ఉన్నాయి. వికారాబాద్ జిల్లాలో 359 పోస్టులు భర్తీ కానున్నాయి. దీంతో సర్కారు బడుల్లో టీచర్ల కొరత తీరనుంది.

కేటగిరీల్లో కొరవడిన స్పష్టత

మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌లో జిల్లాల వారీగా స్కూల్ అసిస్టెంట్, లాంగ్వేజ్ పండిత్, ఫిజికల్ ఎడ్యుకేషన్, సెకెండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించినా, కేటగిరీల వారీగా స్పష్టత లేదు. భర్తీ చేయనున్న పోస్టుల కేటగిరీల వారీగా సమాచారం, సిలబస్ వివరాలను మార్చి 4న విడుదల చేస్తామని విద్యా శాఖ ప్రకటించింది.

జిల్లాల్లో పెరిగిన ఉపాధ్యాయ పోస్టులు

గత ఏడాది ప్రభుత్వం ప్రకటించిన నోటిఫికేషన్‌లో ప్రకటించిన ఖాళీల కంటే వివిధ కేటగిరీల్లో ఈ సారి వికారాబాద్ జిల్లాలో 134 పోస్టులు అదనంగా కలిపారు. జిల్లాలో 191 టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. 102 స్కూల్ అసిస్టెంట్, 77ఎస్‌జీటీ 12ఎల్‌పీటీ పోస్టులు భర్తీచేయాలని అప్పటి ప్రభుత్వం భావించింది. కొత్తగా ప్రకటించిన నోటిఫికేషన్‌తో భర్తీ చేయనున్న ఎస్‌జీటీ, ఎల్‌పీటీ, పీఈటీ పోస్టులు పెరిగాయి. గత నోటిఫికేషన్‌లో ఎస్‌జీటీ పోస్టులు 77 ఖాళీగా ఉండగా కొత్త నోటిఫికేషన్‌లో వాటి సంఖ్య 195కి పెరిగింది. ఈ పోస్టులు గత నోటిఫికేషన్ కంటే 118 ఎక్కువ అయ్యాయి. రంగారెడ్డి జిల్లాలో గతంలో 200 టీచర్ పోస్టులను ప్రకటించగా ఇప్పుడు 379 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సారి పాత వాటికంటే 179 పోస్టులు పెరిగాయి.

ఎన్నికల హామీగా కొత్త నోటిఫికేషన్

అరకొర పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయడాన్ని తీవ్రంగా ఆక్షేపించిన నిరుద్యోగ అభ్యర్థులు 15వేల నుంచి 20వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేయాలని అప్పటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోస్టుల సంఖ్య పెంచాలంటూ నిరుద్యోగ అభ్యర్థులు ఆందోళనలు చేపట్టగా, వారికి మద్దతుగా కాంగ్రెస్, బీజేపీ తదితర ప్రతిపక్ష పార్టీలు కూడా ఆందోళనల్లో పాల్గొని మద్దతిచ్చిన విషయం తెలిసిందే. తాము అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ వేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 11,062 పోస్టులతో ప్రభుత్వం కొత్తగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది.

పోస్టుల వివరాలు

జిల్లా	ఎస్‌ఏ	ఎల్‌పీ	పీఈటీ	ఎస్జీటీ	మొత్తం
రంగారెడ్డి	61	30	06	226	323
వికారాబాద్	102	23	05	195	325
మేడ్చల్	26	08	01	51	86
మొత్తం	189	61	12	472	734

ప్రత్యేక కేటగిరిలో..

జిల్లా	ఎస్‌ఏ	ఎస్జీటీ	మొత్తం	గ్రాండ్ టోటల్
రంగారెడ్డి	10	46	56	379
వికారాబాద్	06	28	34	359
మేడ్చల్	03	20	23	109
మొత్తం	19	94	113	847

డీఎస్సీ కంటే ముందే టెట్ నిర్వహించాలి



కాంగ్రెస్ ప్రభుత్వం మెగా డీఎస్సీని ప్రకటించడం సంతోషం. కానీ టెట్ ఉత్తీర్ణులు కాని అభ్యర్థులు లక్షల్లో ఉన్నారు. అందరికీ అవకాశం లభించాలంటే మొదట టెట్ నిర్వహించాలి. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రమోషన్ కోసం టెట్ ఉత్తీర్ణులై ఉండాలని ఎన్‌సీటీఈ ఉత్వర్వులు ఇవ్వడంతో వారికీ టెట్ పరీక్ష తప్పనిసరి. కాబట్టి టెట్ ఇప్పుడే పెడితే ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు, టెట్ లేని డీఎడ్/బీఎడ్ అభ్యర్థులకు కూడా ఉపయోగకరంగా ఉంటుంది.

- పి.రఘునందన్‌రెడ్డి, టీయూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

పశువులకు గాలికుంటు వ్యాధి

సోకకుండా టీకాలు

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ అనిల్‌కుమార్



వికారాబాద్, ఫిబ్రవరి 29 : పశువులకు గాలి కుంటు వ్యాధి సోకకుండా మార్చి నెలాఖరు వరకు టీకాలు వేస్తామని జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని మార్చి 1 నుంచి 30 వరకు చేపడుతామని చెప్పారు. వ్యాధి ప్రబలకుండా ఈ టీకాలిచ్చేందుకు జిల్లాలో నెల రోజుల పాటు కార్యాచరణ తయారు చేశామన్నారు. మండలానికి 2 నుంచి 3 పశువైద్య సిబ్బంది బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. 3 నెలల వయసు పైబడిన పశువులన్నింటికీ ఉచితంగా టీకాలు ఇస్తామని చెప్పారు. ప్రజాప్రతినిధులకు, పశుపోషకులకు సమాచారం ఇచ్చి చాటింపు చేయించి గ్రామాలకు ఉదయాన్నే వెళ్లి పశువులకు టీకాలు వేస్తామన్నారు. పశువులకు గాలికుంటు వ్యాధి ప్రమాదకరమైందని, ఈ వ్యాధి సోకిన పశువుల నోటిలో, కాళ్లలో పుండ్లు ఏర్పడి మేత మేయక, నడవలేక నీరసిస్తాయన్నారు. పాడి పశువుల్లో పాల ఉత్పత్తి పడిపోతుందన్నారు. వ్యాధి సోకిన పశువులకు చికిత్స చేయకుంటే మరణిస్తాయన్నారు. పశువుకు టీకాలు వేసి చెవి పోగు వేసి పశువులు, వాటి యజమాని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. పశుపోషకులు పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేయించి వ్యాధులు సోకకుండా కాపాడుకోవాలని వైద్యాధికారి కోరారు.



పరిగిలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం

వికారాబాద్ జిల్లాలో 152, మేడ్చల్ జిల్లాలో 1,016 మంది గైర్హాజర్

వికారాబాద్/మేడ్చల్, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి ప్రతినిధులు): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తొలి పరీక్ష గురువారం నిర్వహించారు. తొలి పరీక్షకు వికారాబాద్ జిల్లాలో 152 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ద్వితీయ భాష పరీక్షకు 7,849 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, వారిలో 152 మంది గైర్హాజరయ్యారు. 6,602 మంది జనరల్ విద్యార్థుల్లో 113 మంది హాజరు కాలేదు. ఒకేషనల్ విభాగంలో 1,247మంది విద్యార్థులకు గాను 39 మంది గైర్హాజరయ్యారు. అలాగే మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో మొత్తం 61,581 విద్యార్థులకు పరీక్షలు రాయాల్సి ఉండగా 1,016 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు.

ఇళ్ల నిర్మాణం పేరుతో

ఇసుక దందా

పర్మిట్ ఒక చోట.. డంప్ మరోచోట!

- ఇసుకను దారిమళ్లిస్తున్న అక్రమార్కులు
- గౌతాపూర్‌లో ట్రాక్టర్ ఇసుక రూ.3,500కు విక్రయం
- చర్యలకు ఆదేశించిన ఆర్డీవో అశోక్‌కుమార్



గౌతాపూర్‌లోని నిర్మాణం జరుగుతున్న ఇంటి వద్ద డంప్ చేస్తున్న ఇసుక

తాండూరు రూరల్, ఫిబ్రవరి 29: పర్మిట్‌లో అనుమతి ఒక చోట పొంది మరో చోట ఇసుక డంప్ చేస్తున్న సంఘటన తాండూరు మండలంలో చోటు చేసుకుంది. యథేచ్ఛగా ఇసుక అక్రమ దందా కొనసాగిస్తున్నారు. ఇళ్ల నిర్మాణం పేరుతో ఒక చోటకు అనుమతి పొంది ఇసుకను దారిమళ్లిస్తున్నారు. రెవెన్యూ, మైన్స్, పోలీసు అధికారులు తరలించే ఇసుక ట్రాక్టర్లను పర్యవేక్షించక పోవడంతో అక్రమార్కులు ఇష్టానుసారం డంప్ చేసి ఇసుక వ్యాపారం చేస్తున్నారు. ఖాంజాపూర్ కాగ్నా నది నుంచి తాండూరులోని గాంధీనగర్‌లో ఇంటి నిర్మాణానికి ఎం.రవికుమార్ అనే వ్యక్తి పేరున సాయిపూర్‌కు చెందిన ట్రాక్టర్ యజమాని ఇసుక తరలింపు పర్మిట్ పొందాడు. గురువారం టీఎస్-34టీబీ3110 నంబర్ గల ట్రాక్టర్‌లో కాగ్నా నదిలో ఇసుక నింపుకొని తాండూరు గాంధీనగర్‌లో రవికుమార్ ఇంటి వద్ద డంప్ చేయాల్సి ఉండగా, ఈ ఇసుకను గౌతాపూర్‌లో ఆంజనేయస్వామి ఆలయం వద్ద డ్రైవర్ బిచ్చయ్య రూ.3,500కు ఇసుక విక్రయించి డంప్ చేశాడు. అయితే ఈ విషయంపై విలేకరులు ప్రశ్నించగా, తనకు తెలియదని, డంప్ చేసి వెళుతున్నానన్నాడు. దీనిపై విలేకరులు ఆర్డీవో శ్రీనివాస్‌రావు సమాచారం ఇవ్వగా ట్రాక్టర్ యజమానిపై చర్యలు తీసుకోవాలని ఆర్డీవో మైన్స్ ఏడీ జాకబ్, తాండూరు తహసీల్దార్ తారాసింగ్‌లను ఆదేశించారు. ఏడీ జాకబ్ ఇసుక ట్రాక్టర్‌ను ఖాంజాపూర్ వాగులో పట్టుకుని రూ.5వేల జరిమానా విధించారు. ఇంటి నిర్మాణానికి అనుమతి తీసుకొని ఇసుక విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ట్రాక్టర్ డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేస్తామని తహసీల్దార్ తారాసింగ్ తెలిపారు. కాగ్నా నదితో పాటు వీర్‌శెట్టిపల్లి, కోకట్ తదితర ప్రాంతాల్లోని ఇసుక పర్మిట్లు పొంది అక్రమార్కులు వ్యాపారం చేస్తున్నారు. ఈ విషయంలో కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఇంటికి ఇసుక పర్మిట్ పొందినట్లు ఉన్న రశీదు

ప్రెస్ అకాడమి చైర్మన్‌ను కలిసిన టీయూడబ్ల్యూజే నాయకులు

వికారాబాద్, ఫిబ్రవరి 29: తెలంగాణ ప్రెస్ అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డిని గురువారం పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా వికారాబాద్ టీయూడబ్ల్యూజే(ఐజేయు) యూనియన్ జర్నలిస్ట్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లాలో నెలకొన్న జర్నలిస్టుల సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల చౌడాపూర్ మండలంలో ఓ దినపత్రిక విలేకరి(ఆంధ్రజ్యోతి కాదు) ఉదయ్‌శంకర్ గుండెపోటుతో మృతి చెందిన విషయం చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రెస్ అకాడమి తరఫున ఉదయ్‌శంకర్ కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనికి ఆయన స్పందిస్తూ మార్చి 5వ తేదీ తర్వాత ప్రెస్ అకాడమి కార్యాలయానికి వస్తే అన్నివిషయాలు సమగ్రంగా చర్చించి తగిన న్యాయం చేద్దామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీధర్, జిల్లా కోశాధికారి కె.రాఘవేందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.చుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రెస్ అకాడమి చైర్మన్‌తో టీయూడబ్ల్యూజే నాయకులు

పరిగి మున్సిపల్ వార్షిక అంచనా ఆదాయం రూ.5.13 కోట్లు

- ఏడాది ప్రారంభ నిల్వ రూ.49.68 లక్షలు
- పరిగి మున్సిపల్ బడ్జెట్ సమావేశానికి మీడియాకు నో ఎంట్రీ



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

పరిగి, ఫిబ్రవరి 29: పరిగి మున్సిపాలిటీ సాధారణ బడ్జెట్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 2023-24 అంచనా బడ్జెట్, 2022-23 ఏడాది సవరణలపై చర్చించారు. కొత్త ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనా, ఖర్చులు, గడిచిన ఏడాది ఆదాయం, ఖర్చులు సవరణలపై చర్చ జరిగింది. 2023-24 ఏడాదిలో ప్రారంభనిల్వ రూ.49.68లక్షలు, ఈసారి ఆదాయం అంచనా విలువ రూ.5.13 కోట్లతో కలిపి రూ.5.63కోట్లు, ఈ ఏడాది ప్రభుత్వం నుంచి వచ్చే క్యాపిటల్ నిధులు రూ.9.97కోట్లు. ఆదాయంతో వచ్చే మొత్తంపై కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా చైర్మన్ అశోక్ మాట్లాడుతూ.. పరిగి మున్సిపాలిటీకి సాధారణంగా వచ్చే నిధులే కాకుండా వివిధ గ్రాంట్ల ద్వారా నిధుల కోసం ప్రయత్నం చేస్తానని తెలిపారు. మార్కెట్‌యార్డులో ఇంటిగ్రేటెడ్ రైతు బజారు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. పరిగి పట్టణ అభివృద్ధికి పార్టీలకతీతంగా కలిసికట్టుగా పనిచేస్తామని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న పనులను త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు కృషిచేయాలని సూచించారు. కౌన్సిలర్ల సహకారంతో పట్టణ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని తెలిపారు. పరిగిని మోడల్‌గా నిలుపుతానని తెలిపారు. పరిగిని జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. వైస్ చైర్మన్ ప్రసన్నలక్ష్మి, కమిషనర్ వెంకటయ్య, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు. కనీసం తనకు సమాచారం లేకుండా మున్సిపల్ బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారంటూ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ జె.శ్రీనివాస్ ఆరోపించారు. మరోవైపు పరిగి పురపాలక సంఘ సమావేశాలకు మీడియా ప్రతినిధులకు సమాచారం ఇవ్వడంలేదు. నాలుగేళ్ల నుంచి మున్సిపాలిటీ సమావేశాలకు మీడియాను అనుమతించడంలేదు.న కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా వింత సమాధానాలు ఇస్తుండటం గమనార్హం. పలుమార్లు చైర్మన్, ప్రస్తుత, మాజీ ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్తే సమావేశాలకు పిలవాలని ఆదేశించినా అధికారులు మాత్రం మార్పు రావడంలేదు. అధికారుల తప్పిదాలు ఎక్కడ బయటపడతాయోనన్న భయంతోనే మీడియాకు సమాచారం ఇవ్వడంలేదనే అనుమానాలకు తావిస్తోంది.



మాట్లాడుతున్న తహసీల్దార్

ఓటరు జాబితా సవరణకు సహకరించాలి

కొడంగల్, ఫిబ్రవరి 29: రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితా సవరణకు ప్రజాప్రతినిధులు సహకరించాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ కోరారు. అఖిల పక్షం నాయకులతో గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఓటరు జాబితా సవరణకు రాజకీయ నాయకులు సహకరించాలని సూచించారు. జాబితాలో ఏమైనా తప్పులుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలు సజావుగా సాగేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై రాజకీయ నాయకులకు అవగాహన కల్పించారు. ఓటు వేసే విధంగా, ఈవీఎం పని చేసే విధానంపై తహసీల్దార్ వివరించారు.

ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 29 : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో 69,171 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 68,190 మంది విద్యార్థులు హాజరు కాగా 981 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒక్క నిమిషం ఆలస్యం అయినా అనుమతి లేదనే నిబంధనతో విద్యార్థులు నిర్దేశించిన సమయానికి అరగంట ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష హాల్లోకి తీసుకు వెళ్లనీయకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్నారు. సీసీ కెమెరాల నిఘాలో ప్రశ్న పత్రాల సీల్‌ను తొలగించి విద్యార్థులకు అందించారు. మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్‌కు తావు లేకుండా చర్యలు తీసుకున్నారు. 26 మంది ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్ 42 సెంటర్లను విజిట్ చేశారు. పరీక్ష కేంద్రాలకు దగ్గరలో ఉన్న జిరాక్స్ షాపులను మూసివేసేలా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతీ పరీక్ష కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంచారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవడానికి టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీటిని అందుబాటులో ఉంచారు. కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఇతర మందులు, ఏఎన్ఎం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

ప్రశాంత వాతావరణంలో పరీక్షలు : నోడల్ అధికారి శంకర్



వికారాబాద్ : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని, మానసిక ఆందోళనకు గురి కావొద్దని ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి ఎన్ . శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ఆఫ్ ఎడ్యుకేషన్, తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ ఇచ్చిన సూచనలన్నిటినీ ఇంటర్మీడియట్ ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాటించాలని సూచించారు. ఆయా కళాశాలల్లోని పరీక్షా కేంద్రాల్లో ఏవైనా అనుకోని సంఘటనలు జరిగితే వెంటనే ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి కార్యాలయానికి సమాచారం అందించాలన్నారు. పరీక్షల వత్తిడికి లోనయ్యే విద్యార్థులు టెలిమానస్/ తెలంగాణ హెల్ప్ లైన్ నెంబర్ 14416కు ఫోన్ చేసి మానసిక వైద్య నిపుణుల ద్వారా తగు సూచనలు పొంది, ఆందోళన చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

ఆస్తిపన్నుపై 90శాతం వడ్డీ రాయితీ!

- నేటి నుంచి అమలు , 30రోజులు అవకాశం
- జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను వసూలు 41.17 శాతమే
- పూర్తిగా వెనుకబడిన తాండూరు

తాండూరు, ఫిబ్రవరి 29 : ఆస్తిపన్ను వడ్డీ పేరుకు పోయిన చెల్లింపుదారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. అసలు కంటే ఎక్కువ ఉన్న వడ్డీ ఉన్న వారికి మిత్తిని తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుని ఉత్తర్వులను జారీ చేసింది. వడ్డీలో తొంభై శాతం రాయితీ కల్పిస్తూ బుధవారం రాత్రి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. సరిగ్గా చెల్లింపునకు 30 రోజుల గడువు ఇచ్చారు. గతేడాది కూడా ఈ అవకాశాన్ని కల్పించిన విషయం విధితమే. 2022-2023 ఆర్థిక సంవత్సరం బకాయి ఉండి వడ్డీ పేరుకు పోయిన పన్నుల చెల్లింపుదారులకు 90 శాతం వడ్డీ రాయితి చేసి 10శాతం చెల్లింపుతో వన్ టైం సెటిల్‌మెంట్‌తో (ఓటీఎస్) గతంలో చెల్లించారు. అప్పుడు చెల్లించలేక నష్టపోయాం అనుకునే పన్ను చెల్లింపుదారులకు మరోసారి ఈ ఉత్తర్వులతో ఊరట కల్పించారు. దీంతో పన్నులు వసూళ్లలో పూర్తిగా వెనుకబడిన మున్సిపాలిటీలు ఆర్థికంగా నిలదొక్కుకోవడంతో పాటు బకాయిలను తగ్గించుకునే అవకాశముంటుంది. ప్రైవేటు, ప్రభుత్వ బిల్డింగ్‌లకు కూడా ఈ రాయితీ వర్తించనుంది. జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలుండగా.. అన్నిటిలో బకాయిలు పేరుకు పోయాయి.

పూర్తిగా వెనుకబడి తాండూరు

తాండూరు మున్సిపాలిటీ ఆస్తిపన్ను వసూళ్లలో జిల్లాలోనే పూర్తిగా వెనుకబడి పోయింది. ఇప్పటి వరకు 26శాతం వసూళ్లకే పరిమితమైంది. పరిగి, కొడంగల్ మున్సిపాలిటీలు తాండూరు కంటే మెరుగైన స్థాయిలో ఉన్నాయి.

బకాయిల వివరాలు..

మున్సిపాలిటీ పేరు	బకాయి డిమాండ్ (రూ. కోట్లలో)	వసూలు చేసినది (రూ. కోట్లలో)	బ్యాలెన్స్ (రూ. కోట్లలో)
పరిగి	92.36	15.37	76.99
కొడంగల్	42.32	7.08	35.24
వికారాబాద్	27.33	6.82	20.51
తాండూరు	601.79	54.08	546.99

బకాయిల వివరాలు..

మున్సిపాలిటీ పేరు	బకాయి డిమాండ్ (రూ. కోట్లలో)	వసూలు చేసినది (రూ. కోట్లలో)	బ్యాలెన్స్ (రూ. కోట్లలో)	శాతం
పరిగి	234, 32	103.90	130.42	45
కోడంగల్	165.42	85.89	79.53	52
వికారాబాద్	365.87	270.64	95.23	74
తాండూరు	972. 59	252.78	719.81	26
మొత్తం	1732.02	713.21	1024.99	41.17

ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం.. ప్రేమపెళ్లి

- తెలంగాణ అబ్బాయి.. ఆంధ్రా అమ్మాయి..
- కరన్‌కోట్ పోలీసులను ఆశ్రయించిన వధూవరులు
- తల్లిదండ్రుల సమక్షంలో పోలీసుల కౌన్సెలింగ్



రాజమండ్రి కానిస్టేబుల్ నుంచి వివరాలు తెలుసుకుంటున్న సీఐ అశోక్, ఎస్ఐ విఠల్‌రెడ్డి

తాండూరురూరల్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఇన్‌స్టాగ్రాంలో పరిచయమైన తెలంగాణ అబ్బాయి, ఆంధ్రా అమ్మాయి ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. తమకు రక్షణ కల్పించాలని ఆ జంట వికారాబాద్ జిల్లా తాండూరు మండలంలోని కరన్‌కోట్ పోలీసులను ఆశ్రయించారు. వివరాలిలా ఉన్నాయి. తాండూరు మండలం గౌతాపూర్ గ్రామానికి చెందిన మేతరి శ్రీశైలం హైదరాబాద్‌లోని ఓ జ్యూస్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. అతడికి కొన్ని నెలల కిందట ఇన్‌స్టాగ్రాంలో ఏపీలోని రాజమండ్రి పోనవరం గ్రామానికి చెందిన అనూష అనే యువతితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారింది. నాలుగు రోజుల కిందట శ్రీశైలం, అనూషలు ఖమ్మంలో పెళ్లి చేసుకున్నారు. అనంతరం తాండూరు మండలం గౌతాపూర్ గ్రామానికి వచ్చారు. ఇంట్లో నుంచి అనూష చెప్పకుండా వెళ్లిపోవడంతో ఆమె తల్లిదండ్రులు రాజమండ్రి సమీపంలోని రాజనగరం పోలీస్‌స్టేషన్‌లో అదృశ్యమైనట్లు ఫిర్యాదుచేశారు. అక్కడి పోలీసులు కేసు నమోదు చేసుకుని ఫోన్ ద్వారా అనూష వివరాలు సేకరించారు. శ్రీశైలం ఫోన్‌ను ట్రేస్ చేసి ఆచూకీ కనుగొన్నారు. వీరిరువురు గురువారం కరన్‌కోట్ పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించి తమకు రక్షణ కల్పించాలని కోరారు. అంతలోనే రాజమండ్రి ప్రాంతంలోని రాజనగరం పోలీసు కానిస్టేబుల్‌తోపాటు అనూష తల్లిదండ్రులు కరన్‌కోట్ పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. తల్లిదండ్రులు నచ్చజెప్పినా యువతి వినిపించుకోలేదు. దీంతో సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ విఠల్ రెడ్డిలు అనూష, శ్రీశైలంకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గౌతాపూర్ ఎంపీటీసీ సాయిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జెర్నె నాగప్ప, నాయకులు రాంచంద్రారెడ్డితోపాటు మరికొందరు నచ్చజెప్పారు. వారు వినకపోవడంతో అక్కడి నుంచి పంపించారు. శుక్రవారం మరోసారి కౌన్సిలింగ్ ఇవ్వనున్నట్లు పోలీసులు తెలిపారు.

భారత టెలికాం రంగంలో 'ట్రాయ్' పాత్ర కీలకం



సదస్సులో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

ఆదిభట్ల, ఫిబ్రవరి 29 : భారతీయ టెలికాం రంగం అభివృద్ధి, సేవల్లో ట్రాయ్(టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా) పాత్ర కీలకమని ట్రాయ్ అడ్వైజర్ బి.ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదిభట్ల మున్సిపాలిటీ ఎంపీ పటేల్‌గూడలోని విశ్వేశ్వరయ్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(వీసీఈటీ)లో గురువారం టెలికాం రెగ్యులేటరీ అథారటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వివిధ నెట్‌వర్క్‌ల ఆపరేటర్లు, వినియోగదారులతో మాట్లాడుతూ దేశంలో 118.5 కోట్ల టెలికాం వినియోగదారులు ఉన్నారని, 88.1 కోట్ల మంది ఇంటర్నెట్ వాడుతున్నారని తెలిపారు. టెలీడెన్సిటీ(లాండ్‌లైన్) 84.4 కోట్లు ఉందని చెప్పారు. ట్రాయ్ అన్ని నెట్‌వర్క్‌లను సమానంగా చూస్తుందన్నారు. నెంబర్ మారకుండానే ఇతర నెట్‌వర్క్‌లకు మారిన వారు దేశంలో 91.4 కోట్ల మంది ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ట్రాయ్ జాయింట్ అడ్వైజర్ కేవీ. సురేష్‌బాబు, ఎం.జగదీష్ బాబు, సీహెచ్ బిక్షం, కళాశాల చైర్మన్ కె.లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ రమేష్, ఈసీఈ హెడ్ డాక్టర్ రఘుపతి, ట్రాయ్ సీఏజీ మెంబర్స్, వివిధ నెట్‌వర్క్‌ల ఆపరేటర్లు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

గురునానక్ విద్యాసంస్థల్లో ఘనంగా ఖేల్ మహోత్సవ్



విద్యార్థులకు మెడల్స్ బహుకరిస్తున్న కోహ్లీ

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 29 : ఇబ్రహీంపట్నంలోని గురునానక్ విద్యాసంస్థల్లో గురువారం ఖేల్ మహోత్సవ్-2024ను ఘనంగా నిర్వహించారు. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్‌తో పాటు ట్రాక్ ఈవెంట్స్‌ను నిర్వహించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌చైర్మన్ జీ.ఎస్.కోహ్లీ, ఎండీ డా.హెచ్.ఎస్.సైనీ, డైరెక్టర్ డా.కె.వెంకట్రావు, ప్రిన్సిపాల్ డా.ఎస్.శ్రీనాథరెడ్డి, జాయింట్ డైరెక్టర్ డా.పి.పార్థసారధి, అసోసియేట్ డైరెక్టర్ డా.రిషిసాయల్, హోమియోపతిక్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.రేణుక తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు మల్లికార్జునస్వామి ఆలయం ముస్తాబు

- 6 నుంచి చెన్నారం మల్లప్పగుట్టపై జాతర ప్రారంభం
- ఐదు రోజుల పాటు పూజా కార్యక్రమాలు.. ఏర్పాట్లు పూర్తి
- 8న శివపార్వతుల కల్యాణం, 9న కడవ బోనాల కార్యక్రమం



మల్లికార్జునస్వామి దేవాలయం, ఇన్‌సెట్‌లో మూలవిరాట్

తలకొండపల్లి, ఫిబ్రవరి 29: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా, దర్శనీయ స్థలంగా వెలుగొందుతున్న మండలంలోని చెన్నారం మల్లప్పగుట్టపై గల శ్రీమల్లికార్జునస్వామి ఆలయం శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ప్రతీయేటా మహా శివరాత్రిని పురస్కరించుకొని బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. చెన్నారం గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ మల్లికార్జునస్వామి ఆలయాన్ని దాతలు, భక్తుల సహకారంతో ఘననీయంగా అభివృద్ధి చేసి జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా, దర్శనీయ ప్రాంతంగా తీర్చి దిద్దారు. ఈనెల 6నుంచి 10వరకు కొనసాగే సప్తమ వార్షికోత్సవ, బ్రహ్మోత్సవాలకు నిర్వాహకులు భారీ ఏర్పాట్లు గావించారు. తలకొండపల్లి, ఆమనగల్లు, కడ్తాల, కేశంపేట, మిడ్జిల్, మాడ్గుల, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారు. స్వామివారి కల్యాణం, అగ్నిగుండ మహోత్సవం, కడవ కార్యక్రమాలు అత్యంత ప్రాధాన్యంతో కూడినవి. ఈనెల 10 వరకు కొనసాగే బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు మాకం పాండయ్య, కార్యదర్శి కె.మల్లారెడ్డి, చైర్‌పర్సన్ కౌసల్య, కార్యనిర్వాహకులు పెంటారెడ్డి, గౌరవాధ్యక్షులు పాండురంగా రెడ్డిలు వివరించారు. 6న గణపతిపూజ, స్వామివారి ఏకవాద రుద్రాభిషేకం, పాశుపత రుద్రహోమం, 7న గణపతి పూజ, అగ్నిగుండం మహోత్సవం, అభిషేకం, భజనలు, 8న 11:35 గంటలకు శ్రీ భ్రమరాంభమల్లికార్జున స్వామి కల్యాణం, 9న కడవ(బోనాలు), 10న చక్రతీర్థం, పెద్దమంగళ హారతి కార్యక్రమాలుంటాయని తెలిపారు. ఆమనగల్లు నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపిస్తుందని చెప్పారు.

మంచి, చెడు స్పర్శలపై అవగాహన



మంచి చెడు స్పర్శలకు సంబంధించి పుస్తకాలతో సీనియర్ సివిల్ జడ్జి డి.ఇందిర తదితరులు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 29: మంచి, చెడు స్పర్శలపై పిల్లలు అవగాహన కలిగి ఉండాలని, మంచి స్పర్శ సురక్షితంగా అనిపించి ప్రియమైన అనుభూతిని కలిగిస్తుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డి.ఇందిర అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడ ప్రాథమికోన్నత పాఠశాలలో రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, చైల్డ్ చాప్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పిల్లలకు మంచి స్పర్శ, చెడు స్పర్శలపై నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. పిల్లల కిడ్నాప్‌లు, లైంగిక వేధింపులు అనేకం చూస్తున్నామని, వాటి నుంచి ఎవరికివారు కాపాడుకోవాల్సిన అవసరముందన్నారు. కొందరు తల్లిదండ్రులు పిల్లలకు సున్నితమైన విషయాలను నేర్పేందుకు ఇబ్బంది పడుతున్నారని, అటువంటి వారిలో మార్పు రావాల్సి ఉందని చెప్పారు. పిల్లలకు ఇలాంటి విషయాల్లో అవగాహన లేకపోవడంతో దారుణాలు జరుగుతున్నాయన్నారు. ఇలాంటి విషయాలపై పిల్లలతో చర్చించినప్పుడే వారిలో చైతన్యం వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో చైల్డ్ చాప్టర్ అ సోసియేషన్ అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్‌తోపాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అస్తవ్యస్థంగా ఎన్కేపల్లి బస్‌షెల్టర్



నిరుపయోగంగా మారిన ఎన్కేపల్లి బస్‌షెల్టర్

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 29 : ప్రయాణికుల సౌకర్యార్థం అప్పట్లో నిర్మించిన బస్సుషెల్టర్ నిర్వహణ లోపంతో అస్తవ్యస్థంగా మారింది. మండల పరిధిలోని హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై ఉన్న ఎన్కేపల్లి చౌరస్తా వద్ద 40 ఏళ్ల క్రితం ఆర్అండ్‌బీ అధికారులు, వరల్డ్ విజన్ ఆర్థిక సహకారంతో ప్రయాణికులు కూర్చునేందుకు బస్‌షెల్టర్‌ను నిర్మించారు. కొంత కాలం అది బాగానే ఉన్నప్పటికీ ప్రస్తుతం నిర్వహణ లోపంతో దయనీయమైన స్థితిలో ఉంది. దుమ్ముధూళి, చెత్త చెదారం పిచ్చి మొక్కలతో నిండిపోయింది. అసాంఘీక కార్యాకలపాలకు అడ్డాగా మారింది. పోలీసు నిఘా లేకుండా పోయింది. హిమాయత్ నగర్ పంచాయతీ పరిధిలోకి వచ్చే ఈ బస్సుషెల్టర్‌పై కనీసం పంచాయతీ అధికారులు, సిబ్బంది దృష్టిసారించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. పారిశుధ్య పనులు కూడా చేపట్టకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్‌షెల్టర్‌పై దృష్టిపెట్టి సిబ్బందితో శుభ్రం చేయించి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని ఎన్కేపల్లి, హిమాయత్ నగర్ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే
తెలంగాణ అభివృద్ధి

కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు పామెన జ్యోతిభీంభరత్



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతిభీంభరత్

షాబాద్, ఫిబ్రవరి 29 : కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గంలో తమ పార్టీ ఎంపీ అభ్యర్థి గెలుపుకు కృషిచేస్తామని ఆ పార్టీ మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు పామెన జ్యోతిభీంభరత్ అన్నారు. గురువారం మండలంలోని కేశవగూడ, షాబాద్ గ్రామాల్లో మహిళా కమిటీలను వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలల్లో రాణించాలని, ఇందిరమ్మ స్ఫూర్తితో పని చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి మహిళల మద్దతు అవసరమన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మహిళలకు వరమని చెప్పారు. కాంగ్రెస్‌తోనే మహిళా సాధికారత సాధ్యమని అన్నారు. మిగిలిన గ్యారంటీలను ప్రభుత్వం త్వరలోనే అమలు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షురాలు పీసరి అనితాసురేందర్‌రెడ్డి, పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు అశ్విని, మాజీ సర్పంచ్ సుబ్రమణ్యేశ్వరి, కాంగ్రెస్ నాయకులు రవీందర్, శ్రీను, శివకుమార్, నర్సింహులు, బాల్‌రాజ్, పాల్గొన్నారు.

ఘనంగా కొనగట్టు శివాలయం వార్షికోత్సవం



కొనగట్టు శివాలయంలో హోమం వద్ద భక్తులు

చేవెళ్ల, ఫిబ్రవరి 29 : చేవెళ్ల మండల కేంద్రంలోని కొనగట్టు శివాలయంలోని మల్లిఖార్జునస్వామి వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఆలయ ప్రాంగణం శివ నామ స్మరణతో మారుమోగింది. వార్షికోత్సవం రెండవ రోజులో భాగంగా ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. పున: పూజ, రుద్రాభిషేకం, బిల్వార్చన, అమ్మవారికి సహస్ర పుష్పార్చన, రుద్ర హోమం, పూర్ణాహుతి, మంగళహారతులు, వేదమంత్రోచ్చరణల మధ్య పూజలు చేశారు. అలాగే దేవాలయం ఆవరణలో వివిధ గ్రామాల దంపతులు హోమం వద్ద కూర్చుని మహాశివుడిని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మెన్ సున్నపు వసంతం, ధర్మకర్తలు సున్నపు మాణిక్యప్రభు, ఆలయకమిటీ సభ్యులు, ప్రధాన అర్చకుడు సురేశ్ దేవాలయంలోని శివుడికి, రాజారాజేశ్వరి మాతకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులందరికీ అన్నదానం చేశారు. ఈ పూజల్లో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎస్జీఎఫ్ క్రికెట్ టోర్నీ రన్నరప్‌గా రంగారెడ్డి జిల్లా జట్టు

- విజేతగా నిలిచిన ఖమ్మం జట్టు,
- మూడో స్థానంలో మహబూబ్‌నగర్



జడ్చర్లలో రన్నర్ ట్రోఫీతో రంగారెడ్డి జిల్లా జట్టు

జడ్చర్ల, ఫిబ్రవరి 29 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని మినీస్టేడియం, గంగాపురానికి వెళ్లే దారిలోని మరో మైదానంలో నాలుగు రోజుల పాటు జరిగిన క్రికెట్ టోర్నమెంట్ విజేతగా ఖమ్మం జిల్లా జట్టు నిలవగా, రంగారెడ్డి జిల్లా జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఖమ్మం జిల్లా జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 122 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన రంగారెడ్డి జిల్లా జట్టు నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి కేవలం 86 పరుగులు మాత్రమే చేసింది. 36 పరుగుల తేడాతో గెలిచిన ఖమ్మం జిల్లా జట్టు టోర్నమెంట్ విజేతగా నిలిచింది. మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లా జట్లు మూడు, నాలుగో స్థానాల్లో నిలిచాయి. సెమీ ఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లా జట్లు తలపడగా ఖమ్మం జిల్లా జట్టు గెలిచి ఫైనల్స్‌కు వెళ్లింది. సెమీఫైనల్స్ మ్యాచ్ ఆడిన మహబూబ్‌నగర్, ఖమ్మం జట్ల క్రీడాకారులను జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పరిచయం చేసుకున్నాడు. విజేతలకు జడ్చర్ల తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, ఎంఈవో మంజులాదేవి ట్రోఫీ, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్జీఎఫ్ సభ్యులతో పాటు పీఈటీలు మోయిన్, కిట్టు తదితరులు ఉన్నారు.



అసంపూర్తిగా నిలిచిపోయిన వ్యవసాయ శాఖ అదనపు గది నిర్మాణం పనులు

లక్షలు వెచ్చించారు అసంపూర్తిగా వదిలేశారు

ఆమనగల్లు, ఫిబ్రవరి 29 : ఆమనగల్లు పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయ అదనపు గది నిర్మాణం పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి.ఈ పనుల విషయంలో ఎవరూ చొరవ చూపడం లేదు. దీంతో ఆ భవనం అసంపూర్తిగా నిలిచిపోవడంతో వినియోగంలోకి రాకుండాపోయింది. ఆమనగల్లు వ్యవసాయ శాఖ కార్యాలయానికి సరిపడా గదులు లేక గతంలో రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు ఇబ్బంది పడేవారు. ఈ నేపథ్యంలో అదనపు గదుల నిర్మాణం గురించి స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో దశాబ్దం క్రితం అదనపు గది నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.2 లక్షలు మంజూరయ్యాయి. దీంతో కార్యాలయ పైభాగంలో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి స్లాబ్ వరకు పూర్తి చేశాడు. ఆ తర్వాత పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. నిధులు వెనక్కి మళ్లాయి. పనులను పూర్తి చేసి భవనాన్ని వినియోగంలోకి తేవాలని ఏళ్ల తరబడి స్థానికులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరుతున్న స్పందన లేదు. ఆ భవనం వినియోగంలోకి రాకుండాపోయింది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని భవన నిర్మాణ పనులు పూర్తి చేయించి, దాన్ని వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

పాడి రైతులను ఆదుకోవాలి..

ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వినతి



చిన్నారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, ఫిబ్రవరి 29 : లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పాడి రైతులను ఆదుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం ప్రగతిభవన్‌లో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ప్రమాణస్వీకారానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. అనంతరం చిన్నారెడ్డిని కలిసి పాడి రైతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీని వేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. పాడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. రూ. లక్షలు పెట్టుబడి పెట్టి డైరీఫామ్ నిర్వహిస్తున్న వారికి ఆశించిన మేర ఫలితం రావడం లేదని చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి తక్కువ ధరకు పాలను కొనుగోలు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న విజయ డైరీ నష్టపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో విజయ డైరీ నిర్వాహకులు స్థానిక పాడి రైతుల నుంచి ఎక్కువ ధర చెల్లించి పాలను కొనుగోలు చేయలేకపోతున్నారని చెప్పారు. పాడి రైతులను ఆదుకోవడానికి కేవలం విజయ డైరీ ద్వారా సేకరించిన పాలు, పాల ఉత్పత్తులను కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన


కంకల్‌లో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

పూడూరు, ఫిబ్రవరి 29: మండలంలోని కంకల్‌లో వీరభద్రేశ్వరస్వామి దేవాలయం పునర్నిర్మాణంలో భాగంగా గురువారం ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో గణపతిపూజ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఆలయ నిర్వహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

కొడంగల్: కొడంగల్‌లోని కార్గిల్ కాలనీలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభం, నవగ్రహాల ప్రతిష్ఠాపనను వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజలు చేశారు. మూడు రోజులుగా కొనసాగిన పూజా కార్యక్రమాల్లో మొదటి రోజు శ్రీఆంజనేయస్వామి, నవగ్రహాలు, జలాధివాసం, రెండో రోజు ధాన్యాధివాసం, మూడో రోజు ప్రత్యేక పూజలు చేశారు. రోజూ ప్రత్యేక పూజలతో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. విగ్రహ ప్రతిష్ఠాపనకు ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, పీఏసీఎస్ చైర్మన్ కటకం శివకుమార్‌గుప్త, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ హాజరై పూజలు నిర్వహించారు. పూజా ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సెకండియర్ పరీక్షలు

తాండూరురూరల్, ఫిబ్రవరి 29: ఇంటర్ సెకండియర్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తాండూరు పట్టణంలోని ఎనిమిది పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఎగ్జామినేషన్స్ కస్టోడియన్స్ మల్లినాథప్ప, కృష్ణయ్యలు అన్నారు. మొత్తం 2040మంది విద్యార్థులకు గానూ 2013మంది పరీక్షలు రాయగా 35మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. వీరిలో జనరల్ విద్యార్థులు 1507 గానూ 1482 మంది హాజరుకాగా, 25మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో మొత్తం 541 మందికి గాను 531మంది విద్యార్థులు పరీక్ష రాయగా, పది మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షా కేంద్రాలను తాండూరు తహసీల్దార్ తారా సింగ్, డీఎస్పీ బాలకృష్ణారెడ్డిలు పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టామని డీఎస్పీ తెలిపారు. అయితే నిమిషం నిబంధనలో ఎవరూ ఆలస్యంగా రాకుండా సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకున్నట్లు కస్టోడియన్స్ తెలిపారు.


తాండూరు రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలోకి క్యూలో వెళ్తున్న విద్యార్థులు


తాండూరు చైతన్య జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రం వద్ద తనిఖీ చేస్తున్న సిబ్బంది


కులకచర్ల: రామలింగేశ్వర కళాశాల దగ్గర హాల్ టికెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు

పరిగి: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. పరిగి పట్టణంలో ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, రెసిడెన్షియల్, విజ్ఞాన్, పల్లవి జూనియర్, మోడల్ స్కూళ్లలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9గంటలకు పరీక్షలు ఉండగా, రెండవరోజు గంట ముందుకు 8గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పరిగిలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో 1330మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 36మంది విద్యార్థులు గైరాజరయ్యారు. 1294మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

కులకచర్ల: కులకచర్లలోని రామలింగేశ్వర కళాశాలలో ఇంటర్ సెకండియర్ పరీక్షలకు 224 మంది విద్యార్థులకు గాను ఐదుగురు గైర్హాజరయ్యారు. వివేకానంద కళాశాలలో 166 మందికి ఇద్దరు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్‌లు కామేశ్వరి, రాములు తెలిపారు.

సానుకూల ఆలోచనలతో ఉండాలి


సైన్స్‌ఫెయిర్‌లో మాట్లాడుతున్న కౌన్సిలర్ గోపాల్

వికారాబాద్; ఫిబ్రవరి 29: విద్యార్థులు ఎల్లప్పుడూ సానుకూల ఆలోచనలతో ఉండాలని మద్గుల్ చిట్టెంపల్లి గోపాల్ అన్నారు. మద్గుల్ చిట్టంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సైన్స్ ఫెయిర్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బల్బును కనిపెట్టిన థామస్ ఆల్వా ఎడిసన్ కూడా చిన్నప్పుడు చదువులో వెనుకబడిన వాడేనని తెలిపారు. ఆయనను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రధాన వక్తగా కొత్తగడి పాఠశాల ప్రిన్సిపాల్ ఏ.వీర కాంతం మాట్లాడుతూ.. 10జీపీఏ సాధించిన పదోతరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10వేల బహుమతి ప్రకటించారు. విద్యార్థులు 75సైన్స్ ప్రయోగాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నర్సింహులు, కౌన్సిలర్ నర్సింహులు, ఉపాధ్యాయులు విశ్వనాథం, రాములు, వెంకటయ్య, శ్రీదేవి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నాగరాణి, అనసూయ, న్యాయనిర్ణేతలుగా ఉపాధ్యాయులు యాదయ్య, జనార్దన్ పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మండల కేంద్రంలోని విన్సెంట్ సెంట్రల్ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన సైన్స్‌ఫేర్‌కు ముఖ్య అతిథిగా చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలకు చదువుతో పాటు ఆరోగ్యం, పరిశుభ్రత ఎంతో ముఖ్యమన్నారు. ప్రతీ విద్యార్థి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. విద్యారంగం అభివృద్ధి ప్రధాని మోదీతోనే సాధ్యమన్నారు. అనంతరం సైన్స్‌ఫేర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీధర్‌రెడ్డి, అనిత, ప్రిన్సిపాల్ మల్లికార్జున్, మల్లయ్య పాల్గొన్నారు.


విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

శామీర్‌పేట: విద్యార్థులు సైంటిస్టులుగా ఎదగడానికి సైన్స్ విజ్ఞానం ఎంతగానో దోహద పడుతుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్ అన్నారు. శామీర్‌పేటలోని జగద్గిరిగుట్ట గురుకుల మహిళా డిగ్రీ కళాశాల్లో గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఇష్రత్ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ కళాశాల్లో సైన్స్ అధ్యాపకురాలు ఉషారాణి పీపీటీ ప్రజెంటేషన్, అధ్యాపకురాలు శ్రావణి, టీమ్ డ్రామా, మోడల్స్, స్పెసిమెన్స్, ప్రాజెక్ట్, పోస్టల్ ప్రజెంటేషన్, రక్తశాతం తదితర ప్రజెంటేషన్‌లను సమర్పించి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చేతన, జువాలాజీ అధ్యాపకురాలు సౌమ్య, ఇతర అధ్యాపకులు స్వాతి, శ్రవంతి పాల్గొన్నారు.

దైవభక్తి కలిగి ఉండాలి


రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 29: ప్రతీఒక్కరు దైవభక్తి కలిగి ఉండాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. పోచారం మున్సిపాలిటీ, అన్నానగర్‌లో గురువారం నిర్మించతలపెట్టిన రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఆలయాల నిర్మాణంతో ఆధ్యాత్మిక చింతన అలవడుతుందన్నారు. అన్నానగర్‌లో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కొండల్‌రెడ్డి, బద్దం జగన్‌మోహన్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, బాల్‌రెడ్డి, నర్సింహ, కాలనీవాసులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి


విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 29: విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి అన్నారు. మేడ్చల్ పట్టణంలోని న్యూ లిటిల్ లిల్లి ప్రైవేటు పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైర్‌పర్సన్ దీపిక ముఖ్య అతిథిగావిచ్చేసి ప్రసంగించారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్న నాడే వారు చదువులపై ధ్యాస పెట్టగలరన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వసంతకుమారి, బలగం సినిమా ఫేమ్ సుధాకర్‌రెడ్డి, కరస్పాండెంట్ మంజులా ప్రకాష్ పాల్గొన్నారు.

బొటానికల్ గార్డెన్ సందర్శన


జడ్చర్లలో బొటానికల్ గార్డెన్‌ను సందర్శించిన విద్యార్థులు

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 29: కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు గురువారం జడ్చర్ల పట్టణంలోని తెలంగాణ బొటానికల్ గార్డెన్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు. బొటానికల్ గార్డెన్ సమన్వయ కర్త సదాశివయ్య విద్యార్థులకు వివిధ రకాల మొక్కలు, జంతువులు, వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకులు రఫీయాఖానమ్, శ్రీనివాస్, జంతు శాస్త్ర అధ్యాపకుడు రమేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

చిట్టిఘనాపూర్ ఊర చెరువులో సర్వే

తాండూరురూరల్, ఫిబ్రవరి 29: చిట్టిఘనాపూర్‌లో ఊరచెరువు ఇటీవల కబ్జాకు గురైందని గ్రామస్తుల ఫిర్యాదు మేరకు గురువారం రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు సర్వే నిర్వహించారు. చిట్టిఘనాపూర్ గ్రామ సమీపంలోని సర్వేనెంబర్-28, 29, 30లోని 39 ఎకరాల భూమిలో ఊరచెరువు విస్తరించి ఉంది. అట్టిచెరువు పక్కన తాండూరు పట్టణానికి చెందిన కరీం ఖురీషి అనే వ్యక్తి పొలం ఉంది. అట్టి పొలానికి ఆయన పొలం చుట్టూ ఫెన్సింగ్ వేసుకున్నాడు. అయితే చెరువు భూమిని కొంత కబ్జా చేశాడని గ్రామస్తుల ఫిర్యాదు మేరకు సర్వే నిర్వహించినట్లు సర్వేయర్ శ్రీహరి తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు చెరువు పక్కన 30మీటర్ల దూరం వరకు పట్టా భూములకు సంబంధించిన ఎలాంటి ఫెన్సింగ్ ఉండొద్దన్నారు. ప్రస్తుతం ఈ చెరువు 39ఎకరాల్లో ఉందని తెలిపారు. ఆయన వెంట ఇరిగేషన్ అధికారులు పాషా, గ్రామస్తులు ఉన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

● ఘట్‌కేసర్ డీఐ శ్రీనివాస్

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 29: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఘట్‌కుసర్ డీఐ శ్రీనివాస్ అన్నారు. మాదకద్రవ్యాల నివారణకు అనురాగ్ విద్యాసంస్థకు చెందిన ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు మాదక ద్రవ్యాల నివారణపై ఘట్‌కేసర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మత్తుపదార్థాల వాడకం సరదాగా అలవాటై వ్యసనంగా మారే ప్రమాదముందన్నారు. చెడు వ్యసనాలకు బానిస కావద్దన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శేఖర్, నవీన్, మధుకర్, శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.


ఘట్‌కేసర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఎమ్మెల్యే చొరవతో మండలానికి రూ.3కోట్లు


బషీరాబాద్: సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న వెంకటేష్ మహరాజ్

బషీరాబాద్, ఫిబ్రవరి 29: ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి చొరవతో మండలానికి రూ.3కోట్లు ఉపాధిహామీ నిధులు మంజూరైనట్లు బషీరాబాద్ మాజీ వైస్‌ఎంపీపీ ఎస్.వెంకటేష్‌మహరాజ్ తెలిపారు. మండలంలోని నీళ్లపల్లిలో రూ.5లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీరోడ్డు పనులను గురువారం మండల కాంగ్రెస్‌పార్టీ బీసీసెల్ అధ్యక్షుడు పీకే.శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల బీసీసెల్ అధ్యక్షులు పీకే.శ్రీనివాస్, సీనియర్ నాయకులు పి.శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నరేష్‌చౌహాన్, బాబునాయక్, ఢిల్లీ వెంకటప్ప పీకే.నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

పెద్దేముల్: రుక్మాపూర్‌లో సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణానికి తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఎంఎన్ఆర్ఈజీఎస్ పథకం నుంచి రూ.5లక్షలు మంజూరు చేశారు. దీంతో గురువారం కాంగ్రెస్‌పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ఎస్.నారాయణరెడ్డి సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుర్వమల్లేశం, టి.చంద్రప్ప, శివరాజ్, ఎస్.శ్రీనివాస్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

గోడుగోనిపల్లిలో ఉపాధిహామీ నిధులతో..

దోమ: మండలంలోని గోడుగోనిపల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకులుగురువారం ఉపాధి హామీ నిధులు రూ.2లక్షలతో సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గుజ్జ రాజశేఖర్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, చెక్కలి మొగులయ్య, బాల్‌రెడ్డి, చెక్కలి గోపాల్, జాహేద్, బాలవర్ధన్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను బాధ్యతగా కాపాడుతాం



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటనరసింహారెడ్డి

శామీర్‌పేట, ఫిబ్రవరి 29: ప్రభుత్వ భూములను బాధ్యతగా కాపాడుతామని తహసీల్దార్ వెంకటనరసింహారెడ్డి అన్నారు. మూడుచింతలపల్లి మండలం జగ్గంగూడ గ్రామంలో గురువారం మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ వారు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గంగూడ గ్రామ ప్రత్యేకాధికారి, తహశీల్దార్ వెంకటనరసింహారెడ్డి మాట్లాడుతూ గ్రామ కంఠం భూమిని సంబంధించిన వివరాలను తెలుసుకొని ఆ దిశగా అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. జగ్గంగూడ గ్రామంలోని గ్రామ కంఠం భూమిని(తోట బావి) యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ వారితో క్రీడా మైదానం, వాకింగ్ ట్రాక్, యువకులకు వ్యాయామం చేసుకోవడానికి ఓపెన్ జిమ్, మహిళలు బతుకమ్మలు వేసుకోవడానికి హౌస్ ఏర్పాటు, ఆ స్థలం చుట్టూ పూల మొక్కలు, ఔషధ మొక్కలు, నాటి అందంగా తీర్చిదిద్దడానికి ముందుకొచ్చిన యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం తహసీల్దార్, గ్రామపంచాయతీ సిబ్బందిని స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను సన్మానించారు. మూడుచింతలపల్లి మండలానికి నూతనంగా విచ్చేసిన తహసీల్దార్ వెంకటనరసింహారెడ్డిని మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి ఘనంగా సత్కరించారు.

పోలెపల్లి ఎల్లమ్మ జాతర ప్రారంభం


విద్యుద్దీపాల వెలుగులో ఎల్లమ్మ ఆలయం

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 29: తెలంగాణ రాష్ట్రంలో మినీ మేడారంగా పిలవబడే దుద్యాల మండలంలోని పోలెపల్లి ఎల్లమ్మ దేవత జాతర ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సిడె కార్యక్రమాన్ని ప్రతీ సంవత్సరం మాదిరిగా ఎంతో వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలు 5 రోజుల పాటు కొనసాగుతాయని భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

సంక్షిప్తంగా..

● **మేడ్చల్ టౌన్:** మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని 21వ వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి కమీషనర్ నాగిరెడ్డి గురువారం వార్డులోని పలు కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న డ్రైనేజీ, రోడ్ల సమస్యపై స్థానికులు కమిషనర్‌కు వివరించారు. 21వ వార్డులో వర్షాకాలం సందర్భంగా తలెత్తే మురికి నీటి సమస్యపై స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. సమీపంలోని తుమ్మచెరువు కట్ట తూముల కాలువలు పూర్తిగా ధ్వంసం కావడంతో వర్షాకాలంలో చెరువు నీరు నేరుగా కాలనీల్లోని ఇళ్ల మధ్య చేరుతోందని తెలిపారు. కమిషనర్‌తో పాటు బీఆర్ఎస్ మేడ్చల్ పట్టణ మాజీ అధ్యక్షుడు నారెడ్డి రవీందర్‌రెడ్డి, ప్రతాప్ పాల్గొన్నారు.

● **మేడ్చల్ టౌన్:** మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల్లో 2023-2024 సంవత్సరానికి గాని ఇంటిపన్నులు చెల్లించని ఇంటి యజమానులకు ప్రభుత్వం తరఫున 90శాతం జరిమానా వడ్డీని మాఫీ చేస్తున్నట్లు కమిషనర్లు రాములు, నాగిరెడ్డిలు ప్రకటనలో పేర్కొన్నారు. సకాలంలో పన్నులు చెల్లించని వినియోగదారులకు పన్నుచెల్లించే వీలు కల్పించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం జరిమానా వడ్డీ రుసుములో 90 శాతం మినహాయింపు ఇచ్చిందన్నారు. మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల పరిధిలో ఇంటి పన్నులు బకాయి పడ్డ గృహ యజమానులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఇరు మున్సిపాలిటీల కమిషనర్లు కోరారు.

● **మేడ్చల్ టౌన్:** మేడ్చల్ పట్టణం కిష్టాపూర్‌కు చెందిన మిథిలాబాయి అనే మహిళ తీవ్ర అస్వస్థతకు గురికావటంతో ఆమెకు సమీపంలోని సీఎంఆర్ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం మిథిలా బాయి గర్భ సంచికి శస్త్ర చికిత్స చేయాలని డాక్టర్లు నిర్ధారించారు. దీంతో స్థానిక కౌన్సిలర్ తుండుం గణేష్ గురువారం ఆసు పత్రి యాజమాన్యంతో మాట్లాడి ఆమెకు ఉచితంగా శస్త్ర చికిత్స చేయించారు.

● **దౌల్తాబాద్:** రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పాలమూర్ ఎంపీ టికెట్‌ను బీసీ అభ్యర్థి బండారు శాంతికుమార్‌కు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం, బీసీ సేన నాయకులు డిమాండ్ చేశారు. వారు గురువారంవిలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ పరిధిలో 60 శాతం బీసీ ఓటర్లు ఉన్నారని, బీసీ అభ్యర్థికి ఎంపీ టికెట్ ఇస్తే కచ్చితంగా గెలిపించుకుంటామన్నారు. ఈ సమావేశంలో బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** ఎదులాబాద్‌లో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని బీజేవైఎం నాయకులు గురువారం ఎంపీపీ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎదులాబాద్‌లో గ్రంథాలయం ఏర్పాటు చేయడం వల్ల ఎదులాబాద్ పరిసర గ్రామాల విద్యార్థులకు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి చదువుకోవడానికి సులువుగా ఉంటుందన్నారు. ఈ గ్రామంల్లో నిరుపేదలే ఎక్కువగా ఉండటంతో కోచింగ్‌లకు వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయన్నాయన్నారు. వారిని దృష్టిలో పెట్టుకుని గ్రంథాలయం ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు. మండలంలోనే పెద్ద గ్రామమైన ఎదులాబాద్‌లో తప్పని సరిగ్గా గ్రంథాయలం ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి, మంజునాద్, నితీష్ పాల్గొన్నారు.

● **కొడంగల్:** ఈనెల 18 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నట్లు ఎంఈవో రాంరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బొంరాస్‌పేట్‌లో రెండు, కొడంగల్‌లో నాలుగు పరీక్షా కేంద్రాలతో పాటు ఓ ప్రైవేట్ పరీక్షా కేంద్రాన్ని కేటాయించనున్నట్లు తెలిపారు. గతేడాది పదో తరగతిలో ఫెయిలైన విద్యార్థులు కొడంగల్ పరీక్షా కేంద్రంలో పరీక్ష రాయాల్సి ఉంటుందన్నారు.

● **మేడ్చల్ టౌన్:** గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ జంగారెడ్డికి ఎక్సలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ అవార్డును అందజేశారు. గురువారం నగరంలో ఔట్‌లుక్ ఎడిటెక్ సమ్మిట్ సమ్మిట్‌లో జంగారెడ్డికి అవార్డును అందజేశారు.

క్రైం కార్నర్

రూ.1000 సాయం చేయబోయి..

● రూ.లక్ష నగదు పోగొట్టుకున్నరైతు ● పోలీసులకు ఫిర్యాదు

తాండూరురూరల్, ఫిబ్రవరి 29: ఆపదలో ఉన్న వ్యక్తి రూ.వెయ్యి సాయం చేయబోయి ఓరైతు రూ.లక్ష నగదును పోగొట్టుకున్నాడు. ఈఘటన తాండూరు మండలంలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఐనెల్లి గ్రామానికి చెందిన రైతు గోపాల్‌రెడ్డికి గురువారం మధ్యాహ్నం ఓ గుర్తుతెలియని వ్యక్తి ఫోన్‌చేసి పరిచయమున్న పేరు చెప్పి నమ్మించాడు. తాను ఆసుపత్రిలో ఉన్నానని, ఆపదలో ఉన్న తనకు రూ.వెయ్యి ఇచ్చి ఆదుకోవాలని కోరాడు. అట్టి డబ్బులు ఫోన్‌పే చేయాలని చెప్పడంతో గోపాల్‌రెడ్డి అతడి ఫోన్‌పేకు రూ.వెయ్యికి బదులు రూ.లక్ష కొట్టేశాడు. వెంటనే తేరుకున్న గోపాల్‌రెడ్డి బ్యాంకులో రశీదు సేకరించే లోపు రూ.లక్ష ఆ వ్యక్తికి వెళ్లినట్లు తేలింది. దీంతో ఖంగుతిన్న గోపాల్‌రెడ్డి దిక్కుతోచని స్థితిలో ఎవరికి చెప్పాలో అర్థంకాక కరన్‌కోట్ పోలీసులను ఆశ్రయించాడు. సాయం చేయబోయి మోసపోయానని రైతు గోపాల్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్

● 12బైక్‌లు స్వాధీనం ● పోలీసుల అదుపులో నిందితుడు


నిందితున్ని, చోరీకి గురైన బైక్‌లను మీడియాకు చూపిస్తున్న తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐ అశోక్

తాండూరురూరల్, ఫిబ్రవరి 29: సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఓ బైక్ మెకానిక్ బైక్‌ల చోరీకి పాల్పడుతూ ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. దొంగతనం చేసిన బైక్‌లను తక్కువ ధరకు అమ్మి సొమ్ము చేసుకుందామనుకున్న సమయంలోనే పోలీసులకు దొరికి కటకటాలపాలయ్యాడు. కరన్‌కోట్ రూరల్ పోలీసు స్టేషన్‌లో సీఐ అశోక్ ఆధ్వర్యంలో తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. గౌతాపూర్ చౌరస్తా వద్ద గురువారం ఓవ్యక్తి బైక్‌పై వెళుతున్నాడు. గస్తీలో ఉన్న పోలీసులు బైక్‌ను ఆపి వ్యక్తిని విచారించగా బైక్ దొంగలించి తీసుకెళుతున్నట్లు తేలింది. పోలీసులు అట్టి వ్యక్తిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా ఇప్పటివరకు 12బైక్‌లు చోరీ అయినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని కురుగుంట గ్రామానికి చెందిన బొసిలి నిఖిల్(21) వృత్తిరీత్యా బైక్‌మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అయితే ఇటీవలి కాలంలో సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో బైక్‌లు దొంగతనం చేసేందుకు పథకం రచించాడు. అయితే తాండూరు రైల్వేస్టేషన్, జిల్లా ఆసుపత్రి, మోమిన్‌పేట్, మన్నెగూడ, హైదరాబాద్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, బాల్‌నగర్ తదితర ప్రాంతాల్లో బైక్‌లను దొంగతనం చేశాడు. ఈ వ్యక్తిని విచారించి పూర్తి వివరాలు సేకరించారు. నేరచరిత్ర ఆధారాలు లేవని తెలిపారు. స్వాధీనం చేసుకున్న బైక్‌ల విలువ రూ.6లక్షల వరకు ఉంటుందన్నారు. చాకచక్యంగా నిందితుడు నిఖిల్‌ను పట్టుకున్న కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుళ్లు దస్తప్ప, ప్రతాప్‌సింగ్, అశోక్, శ్రీవాస్తవలకు రివార్డులు అందజేశారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ ఎన్.అశోక్, కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

200 గ్రాముల గంజాయి పట్టివేత


నిందితుడు వికాస్ కుమార్

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 29: గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని పోచారం ఐటీసీ పోలీసులు అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. సీఐ రాజు వర్మ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌లోని కైమూర్ జిల్లా, చాంద్ మండలం, కిల్ని గ్రామానికి చెందిన వికాస్ కుమార్ అనే యువకుడు వాటర్‌ప్లాంట్‌లో కూలీపని చేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన శరణ్య వద్ద నుంచి 200 గ్రాములు గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి, హైదరాబాద్‌లో ఎక్కువ ధరకు విక్రయించేందుకు ప్రయత్నించాడు. గత నెల 27వ తేదీన రైలులో సికింద్రాబాద్‌లో చేరుకున్నాడు. 28న అక్కడి నుంచి బస్సులో పోచారం పోలీసుస్టేషన్ పరిధిలోని జోడిమెట్లలో దిగాడు. నల్లసంచితో అనుమానాస్పదంగా తిరుగుతున్న వికాష్‌కుమార్‌ను పోలీసులు ఆపి తనిఖీచేయగా సంచిలో 200గ్రాముల గంజాయిని గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకొని విచారించారు. గంజాయితో పాటు ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 29: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్ఐ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువు మర్రిపల్లిగూడ కుమ్మరిబావి సమీపంలో నీటిలో మృతదేహం తేలుతున్న విషయాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటనాస్థలానికిచేరుకుని స్థానికుల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. దాదాపు మూడు రోజుల కిందట చెరువులో పడి మృతిచెంది ఉంటాడని అనుమానిస్తున్నారు. మృతుడి వయసు దాదాపు 35నుంచి 40సంవత్సరాలు ఉంటుందని, నల్లని రంగు ప్యాంట్, గోధుమరంగు చొక్కా ధరించిఉన్నట్లు తెలిపారు. మిగతా ఎలాంటి ఆధారాలు లభ్యంకాలేదని, మృతుడి ఆచూకీ తెలియకపోవడంతో గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఘట్‌కేసర్ పోలీసులకు తెలపాలని కోరారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

తాండూరులో వృద్ధుడు..

తాండూరురూరల్, ఫిబ్రవరి 29: తాండూరులో గుర్తుతెలియని ఓవ్యక్తి మృతిచెందినట్లు తాండూరు సీఐ సంతోష్‌కుమార్ తెలిపారు. తాండూరు బస్టాండ్ ఆవరణలో గురువారం 60ఏళ్ల వృద్ధుడు అనారోగ్యంతో మృతి చెందినట్లు సీఐ తెలిపారు. అట్టి వృద్ధుడి వద్ద నాగర్‌కర్నూల్ నుంచి మహబూబ్‌నగర్, మహబూబ్‌నగర్ నుంచి తాండూరుకు వచ్చినట్లు టికెట్ల ఆధారంగా తెలిపారు. మృతదేహాన్ని ఆసుపత్రి మార్చురీలో ఉంచినట్లు సీఐ తెలిపారు. వివరాలు తెలిసిన వారు తాండూరు పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

చోరీకి గురైన సెల్‌ఫోన్‌ల రికవరీ


సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ

ధారూరు, ఫిబ్రవరి 29: చోరీకి గురైన రెండు సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు ధారూరు ఎస్ఐ వేణుగోపాల్గౌడ్ గురువారం తెలిపారు. ధారూరు గ్రామానికి చెందిన చాకలి నర్సింహులు, కుమ్మరి బిక్షపతికి చెందిన సెల్‌ఫోన్లు చోరీ అయినట్లు ఫిర్యాదు చేశారని తెలిపారు. సీఈఐఆర్ సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా చోరీకి గురైన రెండు సెల్‌ఫోన్‌లను గుర్తించి స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించామన్నారు.

బెదిరించి డబ్బులు వసూలు.. కేసు నమోదు

వికారాబాద్, ఫిబ్రవరి 29: నవాబుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓఅంగన్‌వాడీ టీచర్‌ను, అదేవిధంగా ప్రైమరీ స్కూల్ టీచర్‌ను ఓ పత్రిక జిల్లా స్టాఫ్‌రిపోర్టర్ అని(ఆంధ్రజ్యోతి కాదు) చెప్పి బెదిరించి వారి నుంచి డబ్బులు వసూలు చేసిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ కోటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదిలా ఉంటే వికారాబాద్ జిల్లా పరిగిలో సైతం గతంలో ఇలాగే డబ్బులు వసూలు చేసిన రిపోర్టర్లపై ఫిర్యాదు చేసిన ఘటనలు కూడా ఉన్నాయి. అయితే వికారాబాద్ జిల్లాగా ఏర్పడిన నాటి నుంచి విచ్చలవిడిగా ఈపేపర్లు, యూట్యూబ్ ఛానళ్లు పుట్టుకరావడం కేవలం డబ్బులు వసూలే పరమావధిగా మారి కొందరు బ్లాక్ మెయిల్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.